తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT

ఎడిటర్: బక్క రవీందర్

గురువారం 29, ఆగస్టు 2024


## జాతి వ్యతిరేక పోస్టులకు యావజ్జీవ కారాగారం : యుపి ప్రభుత్వ కొత్త డిజిటల్ పాలసీ

2లో


**సమస్య ఏదైనా**

దాని వెనుక ఎవరున్నా...
నిజాన్ని నిర్భయంగా చూపిస్తాం
మీకు తెలిసిన ప్రజల సమస్యలు
మాకు తెలియజేయండి.
ఇండిపెండెంట్ జర్నలిజానికి
వేదిక.. మీ డైలీ రిపోర్ట్
ఫోన్ నెంబర్
8501919707




## ఆక్రమణలైతే విద్యాసంస్థలైనా

# కూల్చివేస్తాం

- తేల్చి చెప్పిన రేవంత్ రెడ్డి
- జన్వాడ ఫామ్ హౌస్ కు అనుమతుల్లేవు.
- కబ్జాకోరులు ఎంతటి వారైనా వదిలేది లేదు
- ముందుగా మా పార్టీ సభ్యుడి ఇంటినే కూల్చాం
- తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేసిన సీఎం రేవంత్ రెడ్డి
- రాష్ట్ర సచివాలయ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు
- భూమి పూజ అనంతరం మీడియాతో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి
- గత పాలకులు పదేళ్లుగా తెలంగాణ తల్లిని మరుగున పడేశారని ఆవేదన
- డిసెంబరు 9న తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని ప్రకటన

హైదరాబాద్: విద్యాసంస్థల ముసుగులో కబ్జా చేస్తే ఊరుకోబోమని, ఎఫ్ఎల్, బఫర్ జోన్లో ఎవరు నిర్మాణాలు చేసినా కూల్చివేస్తామని సీఎం రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. సచివాలయంలో ఆయన మీడియాతో చిట్ చాట్ గా మాట్లాడుతూ, 'హైడ్రా' హైదరాబాద్ వరకే పరిమితమని న్నారు. ఎఫ్టీఎల్, బఫర్ జోన్, పార్కులు, నాలల కబ్జాలే మా మొదటి ప్రాధాన్యం అన్నారు. ప్రజా ప్రయోజనాలు మాకు ముఖ్యమని తెలిపారు. చెరువులు కబ్జా చేసిన ఎవర్ని వదిలి పెట్టమన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు బయట ఉన్న గ్రామ పంచాయతీలు కూడా హైడ్రా పరిధిలోనే ఉన్నాయన్నారు. జంట జలాశయాలను పరిరక్షించడమే మా భాద్యత అన్నారు. ఎఫ్టీఎల్, బఫర్ జోన్ లో నా కుటుంబ సభ్యులు, బంధువు లు ఉంటే వివరాలు ఇవ్వండి నేనే వచ్చి దగ్గర ఉండి కూల్చివేస్తా అన్నారు. కేటీఆర్ ఫామ్ హౌజ్ లీజ్ తీసుకున్న విషయం ఎన్నికల అఫిడవిట్ లో చూపించారా? అని ప్రశ్నించారు. చూపించకుంటే న్యాయ విచారణ ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. కేటీఆర్ స్నేహితుడు ఎఫ్టీఎల్, బఫర్ జోన్ లో ఫామ్ హౌజ్ కడితే నిబంధనలు ఉల్లంఘించిన ప్రాపర్టీస్ కేటీఆర్ ఎలా తీసుకుంటాడన్నారు. ప్రజాప్రతినిధులు ప్రజలకు ఆదర్శంగా ఉండాలన్నారు. మొదటగా మా పార్టీకి చెందిన పళ్ళం రాజు ఫామ్ హౌజ్ కూల్చిందన్నారు. చెరువు శిఖం భూముల్లో నిర్మాణాలు చేపట్టవద్దు. వ్యవసాయం చేసుకుంటే ఇబ్బంది లేదని తెలిపారు. రైతు రుణమాఫీ 2 లక్షల పైన రుణం తీసుకున్న వారు



పై మొత్తానికి కడితే రుణమాఫీ అయిపోతుందన్నారు. వాటికి నిధులు కూడా విడుదల చేశామన్నారు. బీఆర్ఎస్ నేతలు ప్రతి ఇంటికి వెళ్లి రుణమాఫీ కానీ వారి లెక్కలు సేకరించి కలెక్టర్ ఇవ్వండని తెలిపారు. హరీష్ రావు, కేటీఆర్ ప్రతి రైతు వద్దకి వెళ్ళండి అన్నారు. రుణమాఫీ అవ్వని లెక్కలు సేకరించి కలెక్టర్ కు ఇవ్వండి తెలిపారు. నాకు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. రుణమాఫీ విషయంలో సవాల్ చేసిన హరీష్ రావు రాజీనామా చేయకుండా ఉన్నాడు.. హరీష్ రావు దొంగ అని ముందే తెలుసన్నారు. ఆగస్టు 15న రుణమాఫీ చేయాలని విదేశీ పర్యటనలో ఉన్నా మధ్యంతరంగా

మిగతా 2లో

## వచ్చే నెల న్యూయార్క్‌లో మెగా కమ్యూనిటీ సభకు ప్రధాని మోడీ

- 24 వేల మందికి పైగా భారతీయులు హాజరుకు సిద్ధం
- సభా స్థలిలో 15 వేల మందికే చోటు
- అమెరికా అధ్యక్ష ఎన్నికలకు కొన్ని వారాల ముందు సభ



న్యూయార్క్ : ప్రధాని నరేంద్ర మోడీ వచ్చే నెల న్యూయార్క్‌లో ప్రసంగించనున్న మెగా కమ్యూనిటీ సభకు హాజరు కోసం 24 వేల మందికి పైగా భారతీయ సమాజ సభ్యులు సంతకాలు చేశారు. 'మోడీ, యుఎస్ ప్రోగ్రెస్ టుగెదర్' (మోడీ, యుఎస్ కలసి పురోగమించడం) సభను నసావు వెటరన్స్ మెమోరియల్ కొలీజియంలో సెప్టెంబర్ 22న నిర్వహించనున్నారు. అయితే, సభా స్థలిలో 15 వేల మందికి మాత్రమే చోటు ఉంటుంది. మోడీ ప్రసంగించనున్న మెగా సభకు హాజరయ్యేందుకు 24 వేల మందికి పైగా భారతీయ అమెరికన్లు సంతకం చేశారని యుఎస్ఎ భారతీయ అమెరికన్ సమాజం(ఐఎసియు) మంగళవారం వెల్లడించింది. ఐక్యరాజ్య సమితి (యుఎన్) జారీ చేసిన వక్తల తాత్కాలిక జాబితా ప్రకారం ప్రధాని మోడీ సెప్టెంబర్ 22న న్యూయార్క్‌లో ఉన్నత స్థాయి యుఎన్ జనరల్ అసెంబ్లీ సెషన్‌లో ప్రసంగించవలసి ఉన్నది. లాంగ్ ఐలాండ్‌లోని యూనియన్‌డేల్‌లో సభ కోసం రిజిస్ట్రేషన్లు 590 భారతీయ సమాజ సంస్థల ద్వారా వచ్చాయని, అమెరికా వ్యాప్తంగా వారంతా 'స్వాగత భాగస్వాములు'గా సంతకం చేశారని ఐఎసియు ఒక ప్రకటనలో

మిగతా 2లో

## రైల్వేలు, రక్షణ రాజకీయాలకు అతీతం

- రైల్వేలు జాతికి జీవన రేఖ
- రాజకీయ నిందలు వేయతగదు
- రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్



న్యూఢిల్లీ : రైల్వే ప్రమాదాలు రాజకీయ కాక రేపుతుండగా జాతీయ రవాణా సంస్థ అయిన రైల్వేలను రాజకీయ నిందల క్రీడాంశం చేయతగదని, అది దేశానికి జీవన రేఖ అని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం స్పష్టం చేశారు. కొన్ని సంఘటనల్లో కలవరపరిచే ధోరణులు కొన్ని కానవచ్చాయని, ప్రతి ఒక్క సంఘటనపై రైల్వే శాఖ సమగ్ర విచారణ సాగిస్తున్నదని మంత్రి తెలియజేశారు. రైలు పట్టాలపై బండరాళ్లు, కడ్డీలు ఉంచుతుండడం వల్ల రైళ్లు పట్టాలు తప్పుతున్న ఘటనలపై ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇస్తూ ఆ స్పష్టీకరణ ఇచ్చారు. 'కొన్ని సంఘటనల్లో ఆందోళనకరమైన ధోరణులు కొన్ని కనిపించాయి. ఆ విషయాన్ని తీవ్రమైనదిగా పరిగణించాలి' అని వైష్ణవ్ అన్నారు. కేంద్ర మంత్రివర్గ సమావేశం అనంతరం మంత్రి వైష్ణవ్ విలేకరులతో మాట్లాడుతూ, 'రైల్వే, రక్షణ శాఖలు

మిగతా 2లో

## రేపిస్టులకు మరణ శిక్ష

- ప్రస్తుత చట్టాలు సవరిస్తాం
- బెంగాల్ సిఎం మమతా బెనర్జీ



కోల్‌కతా : అత్యాచార ఘటనలను తన ప్రభుత్వం ఏమాత్రం సహించదని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బుధవారం ఉద్ఘాటించారు. దోషులుగా తేలిన అత్యాచార నిందితులకు మరణ శిక్ష విధించేలా ప్రస్తుత చట్టాలకు సవరణను వచ్చే వారం రాష్ట్ర శాసనసభలో ఆమోదించనున్నట్లు మమత తెలియజేశారు. సవరించిన బిల్లుకు ఆమోదముద్ర వేయడంలో గవర్నర్ ఆలస్యం చేసినా లేక ధ్రువీకరణ కోసం రాష్ట్రపతికి పంపినా తాను కోల్‌కతాలో రాజ్ భవన్ వెలుపల ధర్నా చేస్తానని మమత ప్రకటించారు. దోషులుగా తేలిన అత్యాచార నిందితులకు మరణ శిక్ష విధించడానికి చట్టం ఆమోదించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడానికి రాష్ట్రంలో అట్టడుగు స్థాయిలో శనివారం నుంచి

మిగతా 2లో

## కర్నాటక గవర్నర్‌పై రాష్ట్రపతికి ఫిర్యాదు

- కర్నాటక కాంగ్రెస్ యోచన
- సిఎం ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇచ్చిన గవర్నర్



బెంగళూరు : మైసూరు పట్టణ అభివృద్ధి ప్రాధికార సంస్థ (ముడా) కేసులో కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇచ్చిన గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్‌పై ఫిర్యాదు చేయడానికి అధికార కాంగ్రెస్ శాసనసభ్యుల ప్రతినిధివర్గం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలుసుకోగలదని రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి జి పరమేశ్వర్ బుధవారం సూచించారు. ఈ విషయమై తాత్కాలిక వ్యూహం రూపొందించామని, కోర్టులో పరిణామాలను పరిశీలించిన తరువాత దీనిపై నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు. గవర్నర్ ఉత్తర్వును ముఖ్యమంత్రి హైకోర్టులో సవాల్ చేశారు. ఈ విషయమై విచారణను ఈ నెల 29 వరకు 19న వాయిదా వేసిన హైకోర్టు అప్పటి వరకు ప్రైవేట్ ఫిర్యాదుల పరిగణనను

మిగతా 2లో

## ఇంద్రేశంలో అక్రమ నిర్మాణాలకు చెక్





**అక్రమకట్టడాలకు కాలం చెల్లింది**


**ఇంద్రేశం జిపిలో కట్టదిట్టమైన నిబంధనలు**

**నూతన కట్టడాలపై నిఘా.**

సంగారెడ్డి ఆగస్టు 28,డైలీ రిపోర్ట్ పటాన్ చెరువు లోని ఇంద్రేశం గ్రామపంచాయతీ లో ఇక అక్రమ కట్టడాలకు చెక్ పెట్టడానికి సంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారులు రంగం సిద్ధం చేస్తోంది. ఉన్నతాధికారులఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ కార్యదర్శి సుభాష్ అక్రమ కట్టడాల నివారణకు ముందడుగు వేశారు. గతంలోను ఇదే కాలనీ అయినటువంటి పిఎన్ఆర్ టౌన్ షిప్ లో అక్రమ భవనాలను ఎంపీఓలోతో కలిసి కూల్చివేసిన సంగతి తెలిసిందే .అయితే గత కొన్ని రోజులుగా పిఎన్ఆర్ లో కొందరు బిల్డర్స్ అనుమతులను మించి బహుళ అంతస్తులు నిర్మిస్తున్నట్టు పలు పత్రికా కథనాల్లో, పలు సంఘ నేతలు గ్రామపంచాయతీ మరియు జిల్లా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించి జిల్లా అధికారులు గ్రామపంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేసి అక్రమ నిర్మాణాలు కూల్చివేశారు. ఈ సందర్భంగా పంచాయతీ సెక్రెటరీ సుభాష్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ పరిధిలో అక్రమ కట్టడాలను సహించేది లేదన్నారు అక్రమ కట్టడాలు చేపడితే పంచాయతీ దృష్టికి తీసుకురావాలన్నారు. మున్ముందు కూల్చివేతలకు కట్టుదిట్టమైన ప్లాన్‌తో బరిలోకి దిగనుందన్నారు.

## ప్రధానితో సమానంగా భగవత్‌కు భద్రత

- కేంద్ర హోంశాఖ నిర్ణయం



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో సమానంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ భద్రతను అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్(ఎఎస్ఎల్) మోదాకు పెంచుతూ కేంద్ర హోం మంత్రిత్వశాఖ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. భగవత్‌కు ఇదివరకు కల్పించిన భద్రతలో లోపాలు ఉన్నాయని, ముఖ్యంగా బిజెపియేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ఆయన భద్రతకు ముప్పు ఉందని నిఘా వర్గాలు ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో ప్రభుత్వం ఆయన భద్రతను పెంచినట్లు వర్గాలు తెలిపాయి. ఇదివరకు ఆయన జెడ్ ప్లస్ కేటగిరి సెక్యూరిటీని ప్రభుత్వం కల్పించింది. ఆయన భద్రతను సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ

మిగతా 2లో

# వచ్చే నెల న్యూయార్క్‌లో మెగా కమ్యూనిటీ సభకు ప్రధాని మోడీ

తెలియజేసింది. కనీసం 42 రాష్ట్రాల నుంచి భారతీయ అమెరికన్లు సభకు హాజరు కావచ్చునని, స్పందన ముఖ్యంగా మూడు రాష్ట్రాల ప్రాంతం నుంచి అధికంగా ఉందని ఐసిఎయు తెలిపింది. 'ఈ చరిత్రాత్మక సభలో సాధ్యమైనంత ఎక్కువ మంది పాల్గొనగలిగేలా చూడాలని సంకల్పించాం' అని సభ కీలక నిర్వాహకుడు ఒకరు తెలిపారు. యూదులు, జోరాస్ట్రియన్, జైన్, క్రిస్టియన్, సిక్కు, ముస్లిం, హిందు సమాజాల సభ్యులతో సహా విస్తృత శ్రేణి మత వర్గాలు కూడా భాగస్వామ్య సంస్థలు, హాజరయ్యేవారిలో ఉన్నట్లు ఐసిఎయు తెలియజేసింది. వారు హిందీ, తెలుగు, పంజాబీ, తమిళం, బెంగాలీ, మలయాళం, గుజరాతీ సహా విభిన్న భారతీయ భాషలకు ప్రాతినిధ్యం వహిస్తారని సంస్థ తెలిపింది. ప్రధాని మోడీ ప్రసంగంతో పాటు వాణిజ్య, విజ్ఞానశాస్త్ర, వినోద, కళల రంగాల్లోని ప్రముఖ భారతీయ అమెరికన్ల సాంస్కృతిక ప్రదర్శనలు కూడా సభలో చోటు చేసుకుంటాయి. 2014 సెప్టెంబర్‌లో న్యూయార్క్‌లోని సుప్రసిద్ధ మాడిసన్ స్కేర్ గార్డెన్‌లో భారీ స్థాయిలో సభికులను ఉద్దేశించి మోడీ ప్రసంగించిన పది సంవత్సరాల తరువాత లాంగ్ ఐలాండ్‌లో జరగనున్న ఈ సభ కోసం సన్నాహకాలు పూర్తి స్థాయిలో జరుగుతున్నాయని ఈ నెలారంభంలో సంస్థ వర్గాలు 'పిటిఐ'తో చెప్పాయి.
నవంబర్‌లో యుఎస్ అధ్యక్ష ఎన్నికలు జరగడానికి కొన్ని వారాల ముందు ప్రధాని మోడీ పర్యటన చోటు చేసుకుంటున్నది. అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్, డెమోక్రాటిక్ అభ్యర్థి, నల్లజాతి, భారత సంతతి తొలి మహిళ కమలా హారిస్ పోటీ పడుతున్న విషయం విదితమే. ఈ ఏడాది యుఎన్ జనరల్ అసెంబ్లీ 79వ సెషన్‌లో ఉన్నత స్థాయి సార్వత్రిక చర్చ సెప్టెంబర్ 24 నుంచి 30 వరకు జరగనున్నది. యుఎన్ జారీ చేసిన సార్వత్రిక చర్చకు వక్తల తాత్కాలిక జాబితా ప్రకారం, భారత ప్రభుత్వాధినేత 26 మధ్యాహ్నం సెషన్‌లో ప్రసంగించవలసి ఉన్నది. మోడీ రికార్డు స్థాయిలో మూడవ విడత జూన్‌లో భారత ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన విషయం విదితమే.
మోడీ చివరిసారిగా 2021 సెప్టెంబర్‌లో వార్షిక ఉన్నత స్థాయి యుఎన్‌జిఎ సెషన్‌లో ప్రసంగించారు. యుఎన్ ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ సార్వత్రిక చర్చ ప్రారంభానికి ముందు తన నివేదిక సమర్పిస్తారు. ఆతరువాత సమితి అధ్యక్షుడు జనరల్ అసెంబ్లీ 79వ సెషన్‌ను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

# ఆక్రమణలైతే విద్యాసంస్థలైనా కూల్చివేస్తాం

వచ్చి ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేసా అన్నారు రేవంత్ రెడ్డి. హైదరాబాదులోని రాష్ట్ర సచివాలయ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు సీఎం రేవంత్ రెడ్డి నేడు భూమి పూజ చేశారు. ఈ భూమి పూజ కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పార్టీ నేత కె.కేశవరావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, భూమి పూజ కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహించాలని భావించామని, కానీ సమయం లేదని తెలిపారు. కొన్ని రోజుల వరకు మంచి ముహుర్తాలు లేకపోవడంతో, ఇవాల్టి ముహుర్తానికి భూమి పూజ చేశామని వెల్లడించారు. సోనియా గాంధీ వల్లే తెలంగాణ స్వప్నం సాకారమైందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆశయసిద్ధి ఉంటే ఏదైనా సాధ్యమేనని తెలంగాణ ఉద్యమం చెబుతోందని అన్నారు. ఇచ్చిన మాటను సోనియా నిలబెట్టుకోవడం వల్లే 2014లో తెలంగాణ రాష్ట్రం అవతరించిందని వివరించారు. కానీ, గత సర్కారు పదేళ్ల పాటు తెలంగాణ తల్లి ఊసే లేకుండా వ్యవహరించిందని, తెలంగాణ తల్లిని మరుగునపడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ తల్లి కంటే స్వప్రయోజనాలకే పెద్దపీట వేసుకున్నారని రేవంత్ రెడ్డి విమర్శించారు. కాగా, తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైన డిసెంబరు 9వ తేదీ అంటే తెలంగాణ ప్రజలకు పండుగ రోజు అని, ఆ రోజునే తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరిస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. మిలియన్ మార్చ్ తరహాలో భారీ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్‌లో ఎవరు నిర్మాణాలు చేసినా కూల్చివేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సచివాలయంలో ముఖ్యమంతిర రేవంత్ రెడ్డి చిట్‌చాట్ చేశారు. సిడబ్ల్యుసి సభ్యుడు పల్లంరాజు నిర్మాణానే హైడ్రా మొదటి కూల్చివేసిందని, జన్వాడ ఫామ్‌హౌస్ లీజుకు తీసుకున్నట్లు అఫిడవిట్‌లో కెటిఆర్ ప్రస్తావించలేదన్నారు. నిర్మాణాలకు అధికారులే అనుమతి ఇస్తారని, సర్పంచులు కాదని కెటిఆర్ తెలియదా? అని చురకలంటించారు. తన కుటుంబం కబ్జా చేసినట్లు కెటిఆర్ చూపిస్తే దగ్గరుండి కూల్చివేయిస్తానని రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. విద్యాసంస్థల ముసుగులో కబ్జా చేస్తే ఊరుకోమని, ప్రస్తుతానికి హైదరాబాద్‌కు మాత్రమే హైడ్రా పరిమితం చేస్తున్నామని, చెరువులు, నాలాల ఆక్రమణల తొలగింపే తొలి ప్రాధాన్యమని, ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్‌లో ఆక్రమణల తొలగింపే తొలి ప్రాధాన్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 30 ఏళ్ల క్రితం నిర్మించిన కట్టడాలైనా హైడ్రా చర్యలు తీసుకుంటుందని, చెరువుల ఆక్రమణలపై నిజనిర్ధరణ కమిటీ వేస్తామన్నారు.

## రైల్వేలు, రక్షణ రాజకీయాలకు అతీతం

రాజకీయాలకు అతీతంగా ఉంచవలసినవి. రైల్వేలను రాజకీయ నింద క్రీడకు అంశం చేయరాదు' అని చెప్పారు. రైల్వేలు దేశానికి జీవన రేఖ అని, ఏదైనా ప్రతికూలత సంభవిస్తే రైళ్లను అత్యంత సమర్థమైన రీతిలో నడిపేలా కృషి చేయవలసి ఉంటుందని వైష్ణవ్ అన్నారు. వేరే ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ, రైల్వే శాఖ గడచిన ఒక సంవత్సరంలో ప్రస్తుత నెట్‌వర్క్‌కు 5300 కిలోమీటర్ల రైలు మార్గాలు కలిపిందని తెలియజేశారు. రైల్వేల్లో రిక్రూట్‌మెంట్ గురించి మంత్రి ప్రస్తావిస్తూ, జాతీయ రవాణా సంస్థలో ఖాళీల భర్తీకి ప్రభుత్వం ఒక రిక్రూట్‌మెంట్ క్యాలెండర్‌ను రూపొందించిందని తెలిపారు.

## రేపిస్టులకు మరణ శిక్ష

ఒక ఉద్యమాన్ని టిఎంసి ప్రారంభిస్తుందని సిఎం చెప్పారు. 'వచ్చే వారం అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో సవరణ బిల్లును ఆమోదిస్తాం. ఆ తరువాత దానిని గవర్నర్ ఆమోద ముద్ర కోసం పంపుతాం. ఆ బిల్లును పెండింగ్‌లో పెట్టినట్లయితే రాజ్ భవన్ వెలుపల ధర్నా చేస్తాం' అని మమత కోల్‌కతాలో తృణమూల్ కాంగ్రెస్ ఛాత్ర పరిషత్ వ్యవస్థాపక దిన ర్యాలీలో స్పష్టం చేశారు.

## ప్రధానితో సమానంగా భగవత్‌కు భద్రత

ఫోర్స్(సిఐఎస్ఎఫ్) పర్యవేక్షిస్తుంది. భారత వ్యతిరేక, ఇస్లామిక తీవ్రవాద గ్రూపుల నుంచి భగవత్ ముప్పును ఎదుర్కొంటున్నట్లు భావిస్తున్న ప్రభుత్వం ఆయనకు భద్రతను పెంచాలని ఈ నెల మొదట్లో నిర్ణయం తీసుకుంది. కొత్త ప్రొటోకాల్ ప్రకారం భగవత్ భద్రతలో జిల్లా యంత్రాంగాలు, పోలీసులు, ఆరోగ్య శాఖలు కీలక పాత్రను పోషిస్తాయి.

## డిఎంకె ఎంపికి రూ.908 కోట్ల జరిమానా



న్యూఢిల్లీ: విదేశీ మారక నిర్వహణ చట్ట(ఫెమ) నిబంధనలు ఉల్లంఘించిన కేసులో డిఎంకె ఎంపి ఎస్ జగద్రక్షకన్, ఆయన కుటుంబ సభ్యులపై రూ. 908 కోట్ల జరిమానా విధించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి) బుధవారం ప్రకటించింది. 2020లో జగద్రక్షకన్, ఆయన కుటుంబ సభ్యులకు చెందిన రూ. 89.19 కోట్ల ఆస్తులను ఫెమా కింద ఆగస్టు 26న జారీ అయిన ఉత్తర్వుల మేరకు జప్తు చేసుకున్నట్లు ఒక ప్రకటనలో ఇడి తెలిపింది.
76 సంవత్సరాల జగద్రక్షకన్ అరక్కోణం లోక్‌సభ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తమిళనాడుకు చెందిన వ్యాపారవేత్త అయిన జగద్రక్షకన్‌తోపాటు ఆయన కుటుంబ సభ్యులు, బంధువులపై ఫెమా దర్యాప్తును చేపట్టినట్లు ఇడి వివరించింది. ఈ దర్యాప్తు ఫలితంగా 2020 సెప్టెంబర్ 11న ఫెమాలోని సెక్షన్ 37ఎ కింద ఎంపికి చెందిన రూ. 89.19 కోట్ల విలువైన స్థిర, చరాస్తులను స్వాధీనం చేసుకున్నామని ఇడి తెలిపింది. తాజా ఉత్తర్వుల మేరకు ఈ ఆస్తులను జప్తు చేసుకోవడంతోపాటు రూ. 908 కోట్ల జరిమానా విధించినట్లు కేంద్ర దర్యాప్తు సంస్థ తెలిపింది.

## కర్నాటక గవర్నర్‌పై రాష్ట్రపతికి ఫిర్యాదు


వాయిదా వేయవలసిందని విచారణ కోర్టును కోరింది.
'గవర్నర్ ప్రవర్తనపై మేము చర్చలు జరిపి, కొన్ని నిర్ణయాలు తీసుకున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ నిరసనలు నిర్వహిస్తుందని, ఆ తరువాత శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు ఒకేసారి గవర్నర్‌కు వినతిపత్రం అందజేసేందుకు ప్రయత్నిస్తారని మా రాష్ట్ర అధ్యక్షుడు డికె శివకుమార్ వెల్లడించారు' అని పరమేశ్వర వివరించారు. పరమేశ్వర బెంగళూరులో విలేకరులతో మాట్లాడుతూ, కోర్టులో 'పరిణామాలను, నిర్ణయాలను'
పరిగణనలోకి తీసుకున్న తరువాత రాష్ట్రపతిని శాసనసభ్యులు అంతా కలుసుకునే విషయమై తాత్కాలికంగా ఒక ప్లాన్ చర్చించామని చెప్పారు.
'ఈ నెల 31న రాజ్ భవన్ చలో కార్యక్రమాన్ని తలపెట్టాం గవర్నర్‌ను కలుసుకుని, ఆయనకు వినతిపత్రం సమర్పించే అవకాశాన్ని పరిశీలిస్తాం' అని పరమేశ్వర్ తెలిపారు.

## బెంగాల్‌లో బిజెపి బంద్‌కు పాక్షిక స్పందన

**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లో బుధవారం బిజెపి ఆధ్వర్యంలో 12 గంటల బంద్‌లో చెదురుమదురుగా దౌర్జన్య సంఘటనలు చోటు చేసుకున్నాయి. బంద్‌కు పాక్షిక స్పందన లభించింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పోలీసులు, అధికార తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) బంద్ మద్దతుదారుల మధ్య సంఘర్షణ జరిగింది. ఆ ఘర్షణల్లో అత్యంత ప్రధానమైనది ఉత్తర 24 పరగణాల జిల్లాలోని భట్పారాలో జరిగింది. తమ స్థానిక నాయకుడు ప్రియంగు పాండే కారుపై టిఎంసి గూండాలు అనేక రౌండ్లు కాల్పులు జరిపారని బిజెపి ఆరోపించి, ఆ ఘటనకు సంబంధించినదిగా భావిస్తున్న ఒక వీడియోను సామాజిక మాధ్యమ వేదికల్లో పంచుకున్నది, పాండే గాయపడకుండా తప్పించుకున్నప్పటికీ వాహనం డ్రైవర్‌కు, ఒక పార్టీ కార్యకర్తకు తలపై తూటా గాయాలు తగిలినట్లు, వారిని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించినట్లు బిజెపి నాయకులు తెలియజేశారు. దౌర్జన్య సంఘటనలు చోటు చేసుకున్నాయి. వారిద్దరు, వారి మద్దతుదారులు ఎదురెదురుగా నిల్చునని వాదనకు దిగడంతో ఉద్రిక్తలు పెరిగాయి. ఆ వర్గాలను చెదరగొట్టడం పోలీసులకు కష్టమైంది. 'టిఎంసికి చెందిన దుండగులు కాల్పులు జరిపారు. పోలీసులు దగ్గరలో లేకుంటే జనం శక్తి ఏమిటో టిఎంసికి చూపి ఉండేవారం' అని అర్జున్ సింగ్ అన్నారు. 'ప్రశాంత ప్రదేశంలో హింసాకాండ ప్రజ్వలన'కు బిజెపి నాయకుడు ప్రయత్నించారని శ్యామ్ ఆరోపించారు. బుధవారం ఉదయం నుంచి బంద్ అమలు కోసం జనాన్ని కోరుతూ, రోడ్లపై అవరోధాలు ఏర్పాటు చేసినందుకు మాజీ ఎంపిలు రూపా గంగూలి, లాకెట్ ఛటర్జీ, రాజ్యసభ ఎంపి సమిక్ భట్టాచార్య, ఎంఎల్ఎ అగ్నిమిత్ర పాల్ సహా పలువురు బిజెపి నాయకులను నిర్బంధంలోకి తీసుకున్నారు. ఆర్‌జి కర్ ఆసుపత్రిలో డాక్టర్‌పై హత్యాచారం ఘటనపై కొత్తగా ఏర్పాటైన విద్యార్థుల బృందం ఛాత్ర సమాజ్ నిర్వహించిన 'నబన్న అభిజాన్' లేదా సచివాలయానికి పాదయాత్రలో పాల్గొన్నవారిపై మంగళవారం పోలీస్ చర్యకు నిరసన సూచకంగా పిలుపు ఇచ్చిన 'బంగ్లా బంద్' ఉదయం 6 గంటలకు మొదలైంది.

## జెఎంఎం, కాంగ్రెస్ ప్రభుత్వం 'గూఢచర్యం చేస్తోంది'

### - చంపై సోరెన్ ఆరోపణ
### - ఢిల్లీలో ఎఫ్ఐఆర్ దాఖలు



**న్యూఢిల్లీ :** ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు చోటు చేసుకున్న నాటకీయ పరిణామాల్లో మాజీ ముఖ్యమంత్రి, ఆదివాసీ ప్రముఖుడు చంపై సోరెన్ రాష్ట్రంలో జెఎంఎం, కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వానికి సారథ్యం వహిస్తున్న ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌పై 'గూఢచర్యం ఆరోపణలు' చేశారు. ఢిల్లీ చాణక్యపురి పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. గడచిన ఐదు మాసాలుగా చంపై సోరెన్‌ను అనుసరిస్తున్నట్లుగా ఆరోపణలు వచ్చిన ఝార్ఖండ్ ప్రత్యేక బ్రాంచ్ (జెఎస్‌బి) పోలీసులు ఇద్దరిని ప్రశ్నించే నిమిత్తం ఢిల్లీ పోలీసులకు అప్పగించారు. బిజెపి నేత, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ 'స్వతంత్ర భారతంలో అతిపెద్ద రాజకీయ నిఘా' వివరాలను బుధవారం ఢిల్లీలో వెల్లడిస్తూ, 'స్వతంత్ర భారత చరిత్రలో ఒక సిట్టింగ్ ముఖ్యమంత్రి (హేమంత్ సోరెన్) సొంత మంత్రివర్గ సహచరునిపైనే నిఘాకు ఎన్నడూ ఆదేశించలేదు. దివంగత అస్సాం సిఎం నాపై నిఘాకు ఆదేశించిన కథనాలు మీరు విన్నారు. అయితే, ఆ సమయంలో సాక్ష్యాధారాలు ఏవీ లేవు' అని చెప్పారు. 'చంపై సోరెన్ కేసులో మాజీ సిఎం ఢిల్లీకి ఎప్పుడు వచ్చినా ఆయనను అనుసరిస్తున్న ఝార్ఖండ్ ప్రత్యేక బ్రాంచ్ పోలీసులు ఇద్దరు పట్టుబడ్డారు. ఆ ఇద్దరిని మంగళవారం ఢిల్లీ పోలీసులకు అప్పగించారు. వారు సోమవారం (26) నుంచి దేశ రాజధానిలో తాజ్ హోటల్‌లో చంపై సోరెన్ బస చేసిన అంతస్తులోనే ఒక గది బుక్ చేసుకున్నారు' అని శర్మ తెలియజేశారు. బిజెపిలోకి చంపై సోరెన్ ప్రవేశానికి మార్గాన్ని శర్మే సుగమం చేశారు. చంపై సోరెన్ శుక్రవారం (30న) బిజెపిలో చేరతారు. ఆయన జెఎంఎం నుంచి రాజీనామా చేసేంత వరకు ఝార్ఖండ్ జల వనరుల శాఖ మంత్రిగా కొనసాగుతారు. చంపై సోరెన్ కదలికలపై ఒక కన్ను వేసి ఉంచవలసిందిగా తమను రాష్ట్ర ప్రత్యేక బ్రాంచ్ చీఫ్ కోరారని ఝార్ఖండ్ పోలీసులు వెల్లడించినట్లు శర్మ తెలియజేశారు. 'వారి గూఢచర్యం ఐదు నెలలుగా సాగుతోంది.
దానిపై ఎంతో డబ్బు ఖర్చు చేశారు. ఇప్పుడు చంపై సోరెన్ ఢిల్లీలో ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. దర్యాప్తు సాగుతోంది. మా వద్ద ఆ పోలీసుల వివరాలు, ఫోటోలు ఉన్నాయి' అని శర్మ చెప్పారు. ఈ అంశంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని శర్మ కోరారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు కోరుతూ ఝార్ఖండ్ బిజెపి కూడా రాష్ట్ర గవర్నర్‌ను కలుసుకోవచ్చునని భావిస్తున్నారు.



## అధిక రాబడి పేరుతో మోసం.. ఇద్దరి అరెస్టు

**హైదరాబాద్:** తమ కంపెనీలో పెట్టుబడిపెడితే అధిక రాబడి వస్తుందని నమ్మించి అమాయకుల వద్ద నుంచి రూ. 1.02 కోట్లు వసూళ్లు చేసి, బిచాణా ఎత్తేసిన ఇద్దరు మోసగాళ్లను సైబరాబాద్ ఆర్థిక నేర విభాగం పోలీసులు అరెస్టు చేశారు.
డీసీపీ ప్రసాద్ కథనం ప్రకారం.. గోపన్‌పల్లికి చెందిన చంద్రశేఖర్, సునీత దంపతులు. మాదాపూర్‌లో అమెకాన్ డెవలపర్స్ పేరుతో రియల్‌ఎస్టేట్ కంపెనీ ప్రారంభించారు. తమ కంపెనీలో 13 నెలల కాలపరిమితితో పెట్టుబడి పెడితే వారికి అధిక రాబడి చెల్లిస్తామని నమ్మించి పలువురిని మోసం చేశారు. బాధితులు ఫిర్యాదు చేయగా.. నిందితులిద్దరినీ బుధవారం పోలీసులు అరెస్టు చేశారు.

## జాతి వ్యతిరేక పోస్టులకు యావజ్జీవ కారాగారం : యుపి ప్రభుత్వ కొత్త డిజిటల్ పాలసీ



**లక్నో:** రాష్ట్రంలో సోషల్ మీడియా పాలసీలో భారీ మార్పులను యోగి ఆదిత్యనాథ్ సారథ్యంలోని ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. ఈ పాలసీ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్, యుట్యూబ్‌తోసహా సోషల్ మీడియా వేదికలన్నిటికీ వర్తిస్తుంది. కొత్త పాలసీ ప్రకారం అభ్యంతరకర కంటెంట్‌ను పోస్టు చేస్తే కఠినమైన శిక్షలు ఉండడంతోపాటు ఇన్‌ఫ్యూయెన్సర్లకు భారీ ప్రోత్సాహకాలు కూడా ఉంటాయి. జాతి వ్యతిరేక కంటెంట్‌ను పోస్టు చేస్తే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుంది. గతంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఊటి) యాక్ట్‌కు చెందిన 6ఇ, 66ఎఫ్ కింద ప్రభుత్వం చర్యలు తీసుకునేంది. మూడేళ్ల నుంచి యావజ్జీవ కారాగార శిక్షను విధించే విధంగా కొత్త పాలసీని ప్రభుత్వం రూపొందించింది. రాష్ట్ర సమాచార శాఖ రూపొందించిన ఉత్తర్ ప్రదేశ్ డిజిటల్ మీడియా పాలసీ, 2024ను యుపి క్యాబినెట్ మంగళవారం ఆమోదించింది. కొత్త పాలసీ ప్రకారం అశ్లీల లేదా కించపరిచే విధంగా ఆన్‌లైన్‌లో కంటెంట్‌ను పోస్టు చేస్తే నేరపూరిత పరువునష్టం కేసులు నమోదవుతాయి. డిజిటల్ ప్లాట్‌ఫారాల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం వి ఫార్మ్ పేరిట డిటిజిటల్ ఏజెన్సీని సృష్టించనున్నది. డిజిటల్ ప్లాట్‌ఫారాలపై వచ్చే ప్రకటనలతోపాటు వీడియోలు, ట్వీట్లు, పోస్టులు, రీల్స్‌ను కూడా ఇది పర్యవేక్షిస్తుంది. వీటితోపాటు సోషల్ మీడియా ప్లాట్‌ఫారాల ఇన్‌ఫ్యూయెన్సర్లు, అకౌంట్ హోల్డర్లు, ఆపరేటర్లకు నిర్దిష్టమైన చెల్లింపుల పరిమితులను కొత్త పాలసీ విధించింది. ఎక్స్‌కు సంబంధించి గరిష్ఠంగా నెలకు రూ. 8 లక్షలు, ఫేస్‌బుక్‌కు రూ. 4లక్షలు, ఇన్‌స్టాగ్రామ్‌కు రూ. 3లక్షల చెల్లింపుల పరిమితిని ప్రభుత్వం విధించింది. యుట్యూబ్‌కు సంబంధించి వీడియోలకు నెలకు రూ. 8 లక్షలు, షార్ట్‌కు రూ. 7 లక్షలు, పాడ్‌కాస్ట్‌లకు రూ. 7 లక్షల చెల్లింపు పరిమితిని విధించింది. కొత్త డిజిల్ మీడియా పాలసీకి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిందని రాష్ట్ర మంత్రి అనిత్ రాజ్‌భర్ తెలిపారు. జాతి వ్యతిరేక కంటెంట్‌ను సోషల్ మీడియా ప్లాట్‌ఫారాలలో పోస్టు చేస్తే కఠిన శిక్షలు ఉంటాయని ఆయన తెలిపారు. కొత్త పాలసీ నిరుద్యోగ సమస్యకు కూడా ఒక పరిష్కారాన్ని చూపిందని ఆయన చెప్పారు. నిరుద్యోగులకు ఇది మంచి అవకాశమని ఆయన తెలిపారు.

## నాపై వేటు వేసే అధికారం యుపిఎస్‌సికి లేదు

### - మాజీ ట్రైనీ ఐఎఎస్ పూజా ఖేద్కర్ వాదన



**న్యూఢిల్లీ:** తన సివిల్ సర్వీసెస్ అభ్యర్థిత్వంపై అనర్హత వేటు వేసే అధికారం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యుపిఎస్‌సి)కు లేదని మాజీ ఐఎఎస్ ట్రెయినీ అధికారి పూజా ఖేద్కర్ స్పష్టం చేశారు. అధికారాన్ని దుర్వినియోగం చేశారన్న ఆరోపణపై ఉద్యోగాన్ని కోల్పోయిన పూజా ఖేద్కర్ యుపిఎస్‌సి తనపై వేటు వేయడాన్ని సవాలు చేశారు. తనపై యుపిఎస్‌సి చేసిన ఆరోపణలను సమాధానంగా ఢిల్లీ హైకోర్టులో కౌంటర్ అఫిడవిట్‌ను ఆమె దాఖలు చేశారు. ఒకసారి సివిల్ సర్వీసెస్‌కు ఎంపికై ప్రొబేషనర్‌గా నియమితులైన తర్వాత తన అభ్యర్థిత్వాన్ని రద్దు చేసే అధికారం యుపిఎస్‌సికి ఉండదని పూజా ఖేద్కర్ వాదించారు. దఆల్ ఇండియా సర్వీసెస్ యాక్ట్, 1954, ప్రొబేషనర్ రూల్స్ కింద కేంద్ర సిబ్బంది, శిక్షణ మంత్రిత్వశాఖ(డిఓపిటి) మాత్రమే చర్యలు తీసుకునే అధికారం ఉంటుందని ఆమె తెలిపారు. ఈ ఏడాది జులై 31న ఖేద్కర్ ప్రొవిజనల్ అభ్యర్థిత్వాన్ని రద్దు చేసిన యుపిఎస్‌సి భవిష్యత్తులో జరిగే పరీక్షలు లేదా ఎంపికలలో ఆమె పాల్గొనకుండా ఆమెపై నిషేధం విధించింది. తన గుర్తింపు విషయంలో మోసానికి పాల్పడడంతోపాటు సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్, 2022 నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం, అధికార దుర్వినియోగానికి పాల్పడడం వంటి చర్యల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు యుపిఎస్‌సి తెలిపింది. ఖేద్కర్‌పై చీటింగ్, ఫోర్జరీ ఆరోపణలతో క్రిమినల్ కేసును కూడా యుపిఎస్‌సి నమోదు చేసింది. దీంతో..యుపిఎస్‌సి నిర్ణయాన్ని సవాలు చేస్తూ పూజా ఖేద్కర్ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కోర్టుకు సమర్పించిన తన సమాధానంలో ఆమె యుపిఎస్‌సికి తాను తన పేరు విషయంలో ఎటువంటి మోసానికి పాల్పడలేదని వివరించారు. దరఖాస్తుదారుని మొదటి పేరు, ఇంటిపేరులో 2012 నుంచి 2022 వరకు ఎటువంటి మార్పులు లేవని ఆమె తెలిపారు. 2019, 2021, 2022 పర్సనాలిటీ టెస్టులలో సేకరించిన బయోమెట్రిక్ డాటా ద్వారా తన గుర్తింపును యుపిఎస్‌సి ధ్రువీకరించుకున్నట్లు ఆమె తెలిపారు. 2022 మే 26న జరిగిన పర్సనాలిటీ టెస్టు సందర్భంగా తన దస్త్రాలన్నిటినీ కమిషన్ పరిశీలించిందని ఆమె వివరించారు. 2020-21 వరకు పూజా దిలీప్‌రావు ఖేద్కర్ పేరుతో ఓబిసి కోటాను ఉపయోగించుకుని యుపిఎస్‌సి పరీక్ష రాసిన పూజా ఖేద్కర్ అన్ని ప్రయత్నాలు విఫలం కావడంతో పూజా మనోరమ దిలీప్ ఖేద్కర్ పేరుతో ఓబిసితోపాటు పిడబ్లుబిడి(పర్సన్స్ విత్ బెంచ్‌మార్క్ డిజెబిలిటీస్) కోటాల కింద పరీక్షకు హాజరై 821 ర్యాంకుతో పరీక్షలో విజయం సాధించారు.

## ఝార్ఖండ్ శ్రేయస్సుకే బిజెపిలో చేరుతున్నా-చంపై సోరెన్

**రాంచీ :** ఝార్ఖండ్ ప్రయోజనాల దృష్టానే భారతీయ జనతా పార్టీ (బిజెపి)లో చేరాలని నిర్ణయించుకున్నట్లు, జెఎంఎం నుంచి, మంత్రి పదవికి రాజీనామా చేయనున్నట్లు ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి చంపై సోరెన్ బుధవారం ప్రకటించారు. తాను ఏ పరిస్థితికీ భయపడడం లేదని సీనియర్ ఆదివాసీ నేత చంపై సోరెన్ స్పష్టం చేశారు. ఈ వారారంభంలో న్యూఢిల్లీలో కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షాను కలుసుకుని బిజెపిలో చేరనున్నట్లు ప్రకటించిన చంపై సోరెన్ తన కుమారునితో పాటు బుధవారం రాంచీ చేరుకున్నారు. ఆయనకు మద్దతుదారులు అధిక సంఖ్యలో స్వాగతం పలికారు. 'ఝారడ్ ప్రయోజనం దృష్టానే నా నిర్ణయం(బిజెపిలో చేరాలన్నది) నేను పోరాటాలకు అలవాటు పడ్డాను' అని చంపై చెప్పారు. తనపై 'నిఘా' ఉందన్న ఆరోపణ గురించి ప్రశ్నించగా, తాను ఎటువంటి పరిస్థితికీ భయపడడం లేదని ఆయన సమాధానం ఇచ్చారు. తాను జెఎంఎంకు, మంత్రి పదవికి రాజీనామా చేస్తానని చంపై సోరెన్ తెలిపారు.

## జోనల్ సాయి ఫ్రీడం క్రికెట్ కప్ విజేత షాబాద్ హెూలీ స్ప్రీట్ పాఠశాల..............




**శంకర్ పల్లి ఆగస్టు 28:(డైలీ రిపోర్ట్):** శంకర్ పల్లి మండలం జనవాడ గ్రామంలో బుధవారం శంకర్ పల్లి మండలం జోనల్ స్థాయి ఫ్రీడం క్రికెట్ టోర్నమెంట్ జరిగింది. ఈ క్రీడల్లో రంగారెడ్డి జిల్లా, షాబాద్ హెూలీ స్పిరిట్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచే ఫైనల్ విజేతగా నిలిచింది. ఈ క్రికెట్ టోర్నమెంట్లో శంకర్ పల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు, చేవెళ్ల మండల విద్యార్థులు పాల్గొన్నారు. కాగా షాబాద్ హెూలీ స్ప్రీట్ పాఠశాల క్రీడాకారులు, శంకర్ పల్లి మోడల్ స్కూల్ పాఠశాల క్రీడాకారులు పాల్గొనగా ఫైనల్ విజేతగా షాబాద్ నిలిచింది. ఈ సందర్భంగా జూనియర్ సెక్రెటరీ ప్రభాకర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ డాక్టర్. జి. మహేశ్వరరావు గెలుపు ఓటములు సహజమని అన్నారు. వారు ఇరుజట్లను అభినందించారు. జిల్లాస్థాయిలో మరింత మెరుగ్గా రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ లు రాఘవేందర్ రెడ్డి, బసవరాజ్, అరుంధతి, బాబయ్య, ఉపాధ్యాయులు సంతోష్ వేముల, శివ ప్రతీక్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడ - గంగారం రెండు ఏజెన్సీ మండలాల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వివిధ స్కూల్స్,హాస్టల్, జూనియర్ కాలేజ్, ఆశ్రమ పాఠశాలను సందర్శించారు: ఎస్ ఎఫ్ ఐ జిల్లా కో - కన్వినర్ గుగులోతు సూర్య ప్రకాష్.




**కొత్తగూడ,ఆగస్టు 28 డైలీ రిపోర్ట్** కొత్తగూడ - గంగారం రెండు ఏజెన్సీ మండలాల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వివిధ స్కూల్స్,హాస్టల్, జూనియర్ కాలేజ్, ఆశ్రమ పాఠశాలలో సందర్శించారు.అనంతరం కొత్తగూడ మండల జూనియర్ కళాశాల కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది - అధ్యక్ష కార్యదర్శులుగా సంతోష్ రాజేష్ ఎన్నిక అయ్యారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వినింగ్ కమిటీ సభ్యులు రాజేష్,మండల నాయకులు సంతోష్, రాజేష్ అఖిల్,నితిన్ లు పాల్గొన్నారు.

## గణేష్ గడ్డ శ్రీ సిద్ధి గణపతి హుండీ లెక్కింపు - హుండీ ఆదాయం రూ.26,26,142 - అన్నదానం హుండీ ఆదాయం రూ.1,83,476



**పటాన్ చెరు ఆగస్టు 28,డైలీ రిపోర్ట్** పటాన్ చెరు మండలం రుద్రారం గ్రామపంచాయతీ పరిధిలోని గణేష్ గడ్డ నందు స్వయంభుగా వెలిసిన శ్రీ సిద్ధి గణపతి ఆలయంలో బుధవారం హుండీ లెక్కింపును నిర్వహించారు. శ్రీ సిద్ధి గణపతి ఆలయానికి సంబంధించిన 103 రోజుల హుండీ ఆదాయం రూ.26,26,142 (ఇరవై ఆరు లక్షల ఇరవై ఆరు వేల ఒక్క వంద నలబై రెండు రూపాయలు), అలాగే అన్నదానం హుండీ ఆదాయం రూ.183,477 (ఒక లక్ష ఎనబై మూడు వేల నాలుగు వందల డెబ్బై ఏడు రూపాయలు) వచ్చిందని ఆలయ ఈఓ ఎన్.లావణ్య తెలిపారు. హుండీ లెక్కింపును దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ రంగారావు సమక్షంలో కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హుండీలో వచ్చిన ఆదాయాన్ని దేవాలయం అభివృద్ధికి ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలను సమకూర్చున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది ఈశ్వర్, అర్చకులు సంతోష్ శర్మ, సతీష్ శర్మ, అజయ్ శర్మ, అయ్యప్ప పంతులు, జగదీశ్ స్వామి, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు నాణ్యమైన సేవలు అందించాలి

### శంకర్‌పల్లిలో డా. లలిత సంతాన సాఫల్య కేంద్రం ఆసుపత్రిని ప్రారంభించిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య





**శంకర్‌పల్లి: ఆగస్టు 28: (డైలీ రిపోర్ట్):** పేదలు, మధ్యతరగతి వారిని దృష్టిలో ఉంచుకొని రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. బుధవారం శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ లలిత ఆసుపత్రిని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రి యాజమాన్యం వ్యాపార దృక్పథంతో కాకుండా సేవా దృక్పథంతో సేవలందించాలని తెలియజేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులను ముందుగా ప్రేమగా పలకరించి, అనంతరం వారి సమస్యలను తెలుసుకొని సేవలందించాలని సూచించారు. వైద్యో నారాయణో హరి అంటారని, కనిపించే డాక్టర్లే దేవుళ్ళతో సమానమని పేర్కొన్నారు. డాక్టర్ లలిత మాట్లాడుతూ సంతానం లేని దంపతులకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అనుభవజ్ఞులైన వైద్య నిపుణులచే అత్యుత్తమ ఫలితాలను అందిస్తున్న సంతాన సాఫల్య కేంద్రాన్ని పట్టణ ప్రజల కొరకు ప్రారంభించామన్నారు. సంతానం లేని దంపతులకు అత్యుత్తమ ఫలితాలను అందిస్తున్న మొట్టమొదటి ఆసుపత్రిని పట్టణంలో నెలకొల్పామన్నారు. హార్మోన్ల పరీక్షలు, అత్యాధునిక ఆండ్రాలజీ ల్యాబ్, ఎండోస్కోపిక్ శస్త్ర చికిత్సలు, (ఐయుఐ) ఇంట్రా యూట రైన్ఇన్ సెమినేషన్, ఐవిఎఫ్ ఈటి (ఇన్ విట్రో ఫర్టిలైజేషన్ ఎంబ్రయో ట్రాన్స్ ఫర్), ఐసి ఎస్ఐ (ఇంట్రా సైటోప్లాస్మిక్ స్పెర్మ్ ఇంజక్షన్), అండాలను నిల్వ చేయడం, అండ దానం వంటి సేవలను మా ఆసుపత్రి అందిస్తుందని తెలియజేశారు. ఆసుపత్రి యాజమాన్యం డాక్టర్ లలిత శ్రీనివాసులు ఎమ్మెల్యే యాదయ్య ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే యాదయ్య... డాక్టర్ లలిత శ్రీనివాస్ లను అభినందించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి భీమ్ భరత్, మున్సిపల్ చైర్మన్ విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్, మాజీ జెడ్పిటిసి గోపాల్ రెడ్డి, కౌన్సిలర్లు బి.సంధ్యారాణి అశోక్ కుమార్, సంతోష్ రాథోడ్, చంద్రమౌళి, కమల మధు, సవిత చిరంజీవి, చెన్న నాయక్ సిబ్బంది పాల్గొన్నారు.


# ఎమ్మెల్యే కాలె యాదయ్యపై కోడిగుడ్ల దాడి



**చేవెళ్ల ఆగస్టు, 28 (డైలీ రిపోర్ట్)** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల కాంగ్రెస్‌లో విభేధాలు భగ్గుమన్నాయి. స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య వాహనంపై కాంగ్రెస్‌లోని ఓ వర్గం కోడిగుడ్లతో దాడిచేసింది. కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేసేందుకు కాలె యాదయ్య షాబాద్ వెళ్లగా ఇంఛార్జ్ భీంభరత్ వర్గం అడ్డుకుంది. తమ వర్గాన్ని ఎమ్మెల్యే పట్టించుకోవట్లేదని ఆగ్రహం వ్యక్తంచేస్తూ కోడి గుడ్లతో దాడి చేశారు. కాలె యాదయ్య గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. అక్కడకు వచ్చిన షాబాద్ మండలపార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌పై కొందరు కార్యకర్తలు దాడి చేశారు. సుమారు గంటపాటు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. దాడి, నిరసన సమయంలో ఎమ్మెల్యే యాదయ్య కారులోనే ఉండిపోయారు. ఈ క్రమంలో ఇరు వర్గాల వారు బాహాబాహీకి దిగేందుకు ప్రయత్నించగా సమయానికి అక్కడే ఉన్న పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టారు. అనంతరం కారు దిగి వచ్చిన ఎమ్మెల్యే కాలె యాదయ్య లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంచి వెళ్లిపోయారు.

# జన్వాడ ఫాంహౌస్ వద్ద మరోసారి అధికారుల సర్వే





**చేవెళ్ల ఆగస్టు, 28 డైలీ రిపోర్ట్** రంగారెడ్డి జిల్లా శంకరపల్లి మండలం జన్వాడ గ్రామంలోని ఫాంహౌస్ వద్ద రెవెన్యూ ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా మరోసారి సర్వే చేపట్టారు. ఆర్ఐ తేజ, మండల సర్వేయర్ సాయితేజ సహా ఇరిగేషన్ శాఖకు చెందిన ఆరుగురు సభ్యుల బృందం.. నక్ష, డీజీపీఎస్ యంత్రాలతో సర్వే కొనసాగిస్తోంది.జన్వాడ ఫాంహౌస్ పక్క నుంచి ఫిరంగి నాలా (బుల్కాపూర్ కత్వా) ప్రవహిస్తోంది. నాలాలో ఫాంహౌస్ ప్రహరీగోడ, గేటు నిర్మించారని ఆరోపణలున్నాయి. జన్వాడ ఫాంహౌస్ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందన్న ఆరోపణల నేపథ్యంలో అధికారులు సర్వే నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది.కాగా, ఇటీవలే ఇరిగేషన్,రెవెన్యూ అధికారులు జన్వాడ ఫాంహౌస్‌ను పరిశీలించి కొలతలు తీసుకున్న విషయం తెలిసిందే. ఇప్పటికే జన్వాడ ఫాంహౌస్ ను కూల్చొద్దంటూ హైకోర్టును ఆశ్రయించారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సన్నిహితుడు ప్రదీప్ రెడ్డి. అయితే, సిటీలో చెరువుల కబ్జా, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై రూల్స్ ప్రకారమే వెళ్లాలని ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టం చేసింది.రంగారెడ్డి జిల్లా శంకరపల్లి మండలం జన్వాడ గ్రామం సర్వే నెంబర్ 311 (311/7)లో 1,210 చదరపు గజాల్లోని 3894 చదరపు అడుగులతో నిర్మించిన ఫాంహౌస్ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో నిర్మించారని గత కొన్ని రోజులుగా ఆరోపణలు వస్తున్నాయి. అయితే, ఈ ఫాంహౌస్ తనది కాదని కేటీఆర్ తెలిపారు. ఈ ఫాంహౌస్ తన మిత్రుడిదని, తాను లీజుకు తీసుకున్నానని చెప్పారు.

# కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాలే యాదయ్య.





**శంకర్పల్లి ఆగస్టు 28:(డైలీ రిపోర్ట్):** కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా పేదింటి అడబిడ్డల కుటుంబాల్లో వెలుగులు నింపుతుందని అన్నారు ఎమ్మెల్యే కాలే యాదయ్య.. బుధవారం చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో మండలానికి సంబంధించిన 37 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణి కార్యక్రమానికి హాజరయ్యి,లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,,ప్రభుత్వం ద్వారా కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేదింటి ఆడబిడ్డలకు కొండంత భరోసా ఇస్తున్నాయని అన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు,సిబ్బంది, మహిళలు యువతులు పాల్గొన్నారు...

# హైడ్రాపై కాంగ్రెస్ లో మొదలైన లుకలుకలు.!




**హైదరాబాద్ ఆగస్టు, 28 డైలీ రిపోర్ట్** తెలంగాణ రాజకీయాలను హైడ్రా హడలెత్తిస్తోంది. దీనిపై ప్రతి పక్షాలే కాదు.. సొంత పార్టీ నేతలు కూడా ఆందోళన చెందుతున్నారు. అయితే హైడ్రా కూల్చివేతలపై కాంగ్రెస్ అధిష్ఠానం పాజిటివ్ గా రిసీవ్ చేసుకున్నట్లు సమచారం. రాష్ట్రంలో చెరువులు, కుంటలను కాపాడేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఏఐసీసీ సమర్థించినట్లు తెలుస్తోంది. హైడ్రా కూల్చి వేతలపై సొంత పార్టీ సీనియర్ నేతలు, ఇతరులు ఏఐసీసీకి ఫిర్యాదు చేసినట్లు చర్చ జరుగుతోంది.

జంట జలాశయాల్లో ఉస్మాన్ నగర్, హుస్మాన్ సాగర్ లో ఎఫ్ టీ ఎల్, బఫర్ జోన్లలో ఏపీ కాంగ్రెస్ లీడర్లకు చెందిన ఫామ్ హౌజ్ నిర్మాణాలను సైతం హైడ్రా నేలమట్టం చేసింది. దీంతో ఆ రాష్ట్రానికి చెందిన సీనియర్ లీడర్లు నేరుగా కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సొంత ప్రభుత్వంలోనే తమకు న్యాయం జరగడం లేదని ఏఐసీసీ ఎదుట వారు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.అలాగే హైదరాబాద్ చుట్టూ ఉన్న కొందరు సీనియర్ కాంగ్రెస్ లీడర్లు సైతం సీఎం రేవంత్ నిర్ణయాన్ని వ్యతిరేకించి అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారంట. వెంటనే కూల్చివేతలను ఆపేయించాలా ఆదేశాలు ఇవ్వాలని కోరగా.. అసలు రాష్ట్రంలో ఏం జరుగుతుందో అనే విషయాలపై ఏఐసీసీ ఆరా తీసింది.

హైడ్రా కొనసాగిస్తున్న అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై అధిష్ఠానం ఫీల్డ్ లెవల్ ఒపీనియన్ సేకరించినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్న వివిధ ఎన్జీవోలు, రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్ లు, బిజినెస్ పర్సన్స్, కామన్ పబ్లిక్ నుంచి సమాచారం సేకరించారు. అయితే మెజార్టీ పీపుల్ దీనిపై పాజిటివ్ గా రియాక్ట్ అవ్వడంతో సీఎం రేవంత్ చేపడుతున్న ఈ స్పెషల్ డ్రైవ్ ను కొనసాగించాలని నిర్ణయించింది. ఈ మధ్య ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి హైడ్రా కార్యక్రమాలను కూడా పార్టీ అగ్రనేతలకు వివరించారని టాక్. మొత్తానికి ఏఐసీసీ నుంచి ఫుల్ సపోర్టు తో రేవంత్ కూల్చివేతలను చేపడుతున్నారు. మరి కాంగ్రెస్ సీనియర్లు ఎలా రియాక్ట్ అవుతారో చూడాలి.

# మొబైల్ ఫోన్ వాడే పిల్లల్లో.. కనిపించే సమస్య ఇదేనట.. మీరు గమనించారా?





ఇంట్లో పిల్లలు తమ మొబైల్ ఫోన్‌లకు చాలా సమయం వెచ్చిస్తూ, చదువు మీద శ్రద్ధ పెట్టడం లేదని తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తుంటారు. ఇది చాలా సాధారణమైన సమస్య. పిల్లలు నిద్ర లేచినప్పటి నుంచి భోజనం చేసేటప్పుడు, నిద్రపోయే వరకు మొబైల్ ఫోన్‌లు చేతిలో ఉంచుకుంటారు. వాళ్లను ఫోన్‌ల నుంచి దూరంగా ఉండమని చెప్పడం తల్లిదండ్రులకు చాలా కష్టం. ఇలా నిరంతరం ఫోన్లు వాడటం వల్ల పిల్లలు భోజనం చేయడం, చదవడం వంటి ఇతర పనులపై ఆసక్తి కోల్పోతారు. ఫోన్లను ఎక్కువ సేపు వాడటం వల్ల కళ్లు, చెవులకు సంబంధించిన ఆరోగ్య సమస్యలు వస్తాయని మనకు తెలుసు. అయితే, పిల్లలు మొబైల్ ఫోన్‌లను అధికంగా వాడితే వారికి ఇంకే ఇబ్బందులు వస్తాయి? ఆ విషయాన్ని ఇప్పుడు తెలుసుకుందాం.

**మెంటల్ హెల్త్ డ్యామేజ్**

పిల్లలు ఎక్కువ సేపు ఫోన్లు వాడితే ఆటలు ఆడుతూ, వీడియోలు చూస్తూ ఉన్నప్పుడు రంగురంగుల చిత్రాలు చూస్తూ ఉంటారు. ఇలా చేయడం వల్ల వాళ్లకు నిజ జీవితం చాలా నెమ్మదిగా, ఆసక్తి లేనిదిగా అనిపించవచ్చు. దీంతో వాళ్లు ఫోన్లు వాడడం తప్ప ఇంకేమీ చేయాలని అనుకోరు. పుస్తకాలు చదవడం వాళ్లకు బోరుగా అనిపించవచ్చు. ఇది వాళ్ల మనసు మీద చాలా చెడు ప్రభావం చూపుతుంది.

**స్పీచ్ డే**

అప్పుడప్పుడే మాట్లాడటం నేర్చుకుంటున్న చిన్న పిల్లలు ఎక్కువ సేపు ఫోన్లు వాడితే వాళ్లకు మాటలు అంత ఫ్లోగా రావు. ఎందుకంటే, వాళ్లు ఫోన్‌లపై ఎక్కువ దృష్టి పెట్టడం వల్ల ఇంట్లో జరిగే సంభాషణల మీద శ్రద్ధ పెట్టరు. దీంతో వాళ్లు మాట్లాడటం నేర్చుకోవడానికి ఎక్కువ సమయం పడుతుంది.

**హార్మోనల్ చేంజెస్**

పిల్లలకు మొబైల్ ఫోన్‌లు ఇవ్వడం వల్ల వాళ్లు కొంత సేపు సంతోషంగా ఉంటారు. ఫోన్‌లలో వాళ్లకు ఇష్టమైన కార్టూన్‌లు చూస్తే వాళ్ల శరీరంలో డోపమిన్ అనే హార్మోన్ విడుదల అవుతుంది. దీంతో వాళ్లు సంతోషంగా ఉంటారు. అయితే, ఫోన్‌లు లేకపోతే వాళ్లకు డోపమిన్ విడుదల కాదు. దీంతో వాళ్లు సంతోషంగా ఉండడం కష్టం. ఇది వాళ్లకు చదవడం, ఆడడం, నేర్చుకోవడం వంటి పనులపై ఆసక్తి కోల్పోయేలా చేస్తుంది.

**అయిస్ ప్రాబ్లమ్స్**

కోవిడ్-19 తర్వాత పిల్లలు ఎక్కువ సేపు స్క్రీన్‌ల ముందు ఉంటున్నారు. ఆన్‌లైన్ క్లాసులు, వాట్సాప్ గ్రూపులు దీనికి కొన్ని కారణాలు. ఎక్కువ సేపు ఫోన్‌లు వాడటం వల్ల పిల్లలకు కళ్లు దెబ్బతింటాయి. దీంతో వాళ్లకు శాశ్వతంగా కళ్ళు పాడవ్వొచ్చు. కోవిడ్ తర్వాత ఈ సమస్యలు ఎక్కువగా మారాయని నిపుణులు చెబుతున్నారు. స్క్రీన్‌ల నుంచి వచ్చే నీలి కాంతి ఎక్కువగా పడితే కార్నియా సమస్యలు వస్తాయి. దీంతో చిన్న వయసులోనే కళ్లద్దాలు పెట్టుకోవాల్సి వస్తుంది.



కె.ప్రదీప్ జర్నలిస్ట్
౦9198855515551

# రెజీనా స్టైలిష్ లుక్ కుర్రాళ్లలో కాక పుట్టించేలా!

చెన్నై సోయగం రెజీనా సోషల్ మీడియా యాక్టివిటీ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఎప్పటికప్పుడు కొత్త ఫోటోలతో కొంగొత్తగా కుర్రాళ్లని ఆకర్షిస్తుంటుంది. ఫ్యాషన్ ఎంపికల్లో తనదైన మార్క్ తప్పనిసరని ప్రూవ్ చేసిన సంద ర్భాలెన్నో. తమిళ సోయగాల్లో తానో స్పెషల్ గా ఫోకస్ అవుతుంది. బేసిక్ గా కోలీవుడ్ భామలు గ్లామర్ షోకి కొన్ని పరిమితలంటూ మెయింటెన్ చేస్తుంటారు. కానీ రెజీనా మాత్రం ఆ విషయంలో బాలీవుడ్ భామలకే ధీటుగా నిలుస్తుంది.  ఆరంభంలో మడికట్టి కూర్చున్నా! కాలక్రమంలో ట్రెండ్ ని ఫాలో అవుతూ డిజైనర్ దుస్తుల్లో ట్రెండ్ నే సృష్టించే స్థాయికి ఎదిగింది. చేతిలో సక్సెస్ లున్నా లేకపోయినా ఇప్పటికీ మార్కెట్ లో బ్రాండ్ గా కొనసాగుతుందంటే?ఆ క్వాలిటీ కూడా ఓ కారణంగా చెప్పొచ్చు. తాజాగా మరో ఫోటోతో నెటి జనుల ముందుకొచ్చేసింది. ఇదిగో ఇక్కడిలా బ్లూ అండ్ వైట్ కాంబినేషన్ లో అమ్మడి స్టైలిష్ లుక్ ఇంట్రెస్టింగ్. అమ్మడు టాప్ టూ బాటమ్ ఎంపిక చేసుకున్న యాక్సరసీస్ మరింత స్టైలిష్ గా తీర్చిదిద్దాయి. నడి నెత్తిన స్పాట్ లైట్..బ్యాక్ గ్రౌండ్ బ్యూటీ ప్రతీది రెజీనా బ్యూటీని ఫోకస్ చేస్తున్నాయి. వివిధ భంగిమల్లో కెమెరాకి ఫోజులు నెట్టింట వైరల్ గా మారాయి. వాట్ ఈజ్ యుర్ టైప్ అంటూ ఫోటోని ఉద్దేశించి ఓ క్యాప్షన్ కూడా పోస్ట్ చేసింది. దీంతో కామెంట్ బాక్సులో నెటి జనుల పోస్టులు అంతే ఇంట్రెస్టింగ్ గా కనిపిస్తున్నాయి. లుక్స్ గార్జియస్...సో బ్యూటీఫుల్ అంటూ అమ్మడి అందాన్ని పొగడ్తలతో రెట్టింపు చేసేస్తున్నారు.ఇక రెజీనా సినిమాల సంగతి చూస్తే జయాపజయాలతో సంబంధం లేకుండా సినిమాలు చేస్తోంది. గతేడాది మూడు రిలీజ్ లతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. అంతకు ముందు ఏడాది నాలుగు రిలీజ్ లతో థియేటర్లో కనిపించింది. మరి ఇందులో విజయాలు ఎన్ని అంటే బూతద్దం పెట్టి వెతికినా విజయం కనిపించదదు. కానీ 2024 లో మాత్రం ఫుల్ బిజీగా ఉంది. గత రెండు సంవత్సరాలకంటే ఎక్కువ సినిమాలే కమిట్ అయింది. అవన్నీ ఆన్ సెట్స్ లో ఉన్నాయి.



# పాకెట్ మనీ కోసం చేసిన పనితో ఇంతవరకూ!

డాక్టర్ కాబోయి సినిమా హీరోయిన్లు అయిన వాళ్లెంతో మంది ఉన్నారు. ఇప్పుడు ఏ హీరోయిన్ ని అడిగినా చాలా మంది హీరోయిన్ల నుంచి ఇదే సమాధానం వస్తుంది. సరదాగా ట్రై చేసి సక్సెస్ అయిన వాళ్లు కొంత మందతే? అదే జీవితం తో ప్రయత్నించి సక్సెస్ అయిన వారు మరికొంత మంది. మరి సీనియర్ నటి త్రిష సరదాగా ట్రై చేసిందా? సీరియస్ గా ట్రై చేసి హీరోయిన్ అయిందా? అంటే అమ్మడు రెండో రకం అంటోంది. అవును ఈ బ్యూటీ సినిమాల్లోకి వచ్చే ఆలోచనే లేదట. ఏదో సరదాగా పాకెట్ మనీ కోసం ప్రయత్నించి పెద్ద హీరోయిన్ అయిపోయింది అన్న సంగతి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. క్రిమినల్ సైకాలజీ చదవడం త్రిష డ్రీమ్ అట. స్కూల్లో ఉండగా లాయర్ అవ్వాలను కుందిట. కాలేజీకి వచ్చాక మోడలింగ్ చేయడంతో చిన్న యాడ్ లో నటించే అవకాశం రావడం.. ఆతర్వాత జోడీలో హీరోయిన్ సిమ్రన్ ఫ్రెండ్ పాత్ర అనుకోకుండా రావడంతో సర్లే పాకెట్ మనీకైనా డబ్బులొస్తాయా? స్నేహితురాలిగా నటించిందిట. తొలుత నటించడానికి నాన్న ఒకే చెప్పినా.. మామ్ మాత్రం ఒప్పుకోలేదంది. చివరికి అలక పానుపు ఎక్కితే ఒప్పుకు న్నారుట. ఎలాంటి కష్టం తెలియకుండా పెరిగిన తనకి సినిమా అనేది కష్టం చూపిస్తుందని తల్లి ముందే హెచ్చరించారుట. వాటిని తట్టుకునే శక్తి ఉంటే ట్రై చేయ్ లేకపోతే కంపర్ట్ జోన్ వదిలి వెళ్లొద్దు అని చెప్పిందిట. అలా త్రిష తెరంగేట్రం జరిగింది. అటుపై వర్షంలో ఛాన్స్ అందుకోవడం...అది బ్లాక్ బస్టర్ అవ్వడంతో ఎంత పెద్ద హీరోయిన్ అయిందో చెప్పాల్సిన పనిలేదు.తమిళ్ పరిశ్రమల్ని కొన్నాళ్ల పాటు ఏలింది. ఇప్పటికీ అదే చరిష్మాతో కొనసాగుతుంది. సీనియర్ హీరోలకు పర్ఫెక్ట్ ఛాయిస్ గా నిలుస్తుంది. దాదాపు రెండు దశాబ్దాలుగా హీరోయిన్ స్టేటస్ ని ఆస్వాదిస్తుంది. గతేడాది మూడు సినిమాలతో ప్రేక్షకుల్ని అలరించింది. ప్రస్తుతం ఐదారు సినిమాలతో బిజీగా ఉంది. అవన్నీ సీనియర్ హీరోలకు జోడీగా నటిస్తోన్న చిత్రాలే. అందుకు గాను భారీ పారితోషికం తీసుకుంటుంది. దాదాపు 12 కోట్ల వరకూ ఛార్జ్ చేస్తుం దని ఇప్పటికే కథనాలు వైరల్ అయిన సంగతి తెలిసిందే. అన్నట్లు నేడు త్రిష పుట్టిన రోజు. ఈ సందర్భంగా అందాల నటికి హ్యాపీ బర్త్ డే. ఈరోజుతో 41 లోకి అడుగు పెట్టింది.



# ఇదంతా పబ్లిసిటీ స్టంటా ఊర్వశి!

విలువైన వస్తువు ఏదైనా పోనంతవరకే జాగ్రత్తగా ఉండాలంటారు. పోయిన తర్వాత దాన్ని తిరిగి పొందడం అన్నది అసాధ్యం. చాలా రేర్ కేసెస్ లోనే అది సాధ్యమవుతుంది తప్ప! అన్నిసార్లు అది సాధ్యంకాదు. ఇక ఫోన్లు..వెలెట్లు పోతే దొరుకుతాయా? అది జరిగే పని కాదు. మరి ఇవన్నీ ఊర్వశి రౌతేలాకి తెలియదం టారా? ఎందుకు తెలియదు..కచ్చితంగా తెలుసు. కానీ ప్రచారం కావాలంటే ఏదో ఒక విషయం మీద నెట్టింట హల్చల్ చేయాలిగా.  కోహ్లీ, రోహిత్.. ఆ రోల్స్ సెట్ చేసిన సల్మాన్ సరిగ్గా ఊర్వశి రైతేలా ఇప్పుడదే చేస్తుందని నెటి జనులు ఆడేసుకోవడం మొదలు పెట్టారు. ఇండియా-పాకిస్తాన్ మ్యాచ్ లో ఫోన్ పోయిందని ట్విటర్లోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత రెండు రోజులకి పోయిన ఫోన్ తిరిగినిచ్చిన వారికి రివార్డు ఇస్తానంటూ మరో ప్రకటన చేసింది. దీంతో అమ్మడు ఇక్కడే దొరికిపోయింది. పోయిన ఫోన్ గురించి ఎందుకింత రచ్చ చేస్తుందని ..ఒక్కసారి గతంలోకి వెళ్లి చూడగా! ఇదంతా పబ్లిసిటీ కోసం చేస్తోన్న డ్రామా అంటూ నెటి జనులు అభిప్రాయపడుతున్నారు. అసలు ఫోన్ పోతే ఇంత సీన్ క్రియేట్ చేయాలా? దొరికితే పోలీసులు తెచ్చిస్తారు? అంతవరకూ ఆగలేదా? ఎందుకిలా ఇన్ స్టాలో టైమ్ వేస్ట్ చేస్తావంటూ మండిపడుతున్నారు. గతంలో ఓ క్రికెటర్ విషయంలో ఇలాగే సోషల్ మీడియాలో పోస్ట్ లు పెట్టి అతన్ని డీగ్రేడ్ చేయాలని చూసిందని నెటి జనులు మండిపడు తున్నారు. అతడికి సంబంధం లేని విషయంలో కావాలని లాగి మీడియా దృష్టిలో పడటం కోసం ఇలా చేస్తుందని కొందరు ఆరోపించారు. అప్పుడు కూడా సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు ఎదుర్కకుంది. దీనికి సదరు క్రికెటర్ గట్టిగానే కౌంటర్ ఇచ్చాడు. తాజాగా ఫోన్ పోయిందంటూ చేస్తోన్న ప్రచారం చూస్తుంటే మీడియా అటెన్షన్ కోసమే ఇలాంటి పనులకు పూనుకుందని మండిపడుతున్నారు.



# జక్కన్న కోసం ఈ త్యాగాలు తప్పవు మహేషా..



ఫెయిల్యూర్ అంటే తెలియని టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ రాజమౌళి ప్రస్తుతం పాన్ వరల్డ్ రేంజ్ లో సూపర్ స్టార్ మహేష్ బాబుతో మూవీ చేయబోతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా స్క్రిప్ట్ ఇప్పటికే కంప్లీట్ అయింది. ప్రస్తుతం మూవీ ప్రీ ప్రొడక్షన్ వర్క్ నడుస్తోంది. ఇండియన్ సిల్వర్ స్క్రీన్ పై అత్యంత భారీ బడ్జెట్ తో విజువల్ వండర్ గా ఈ చిత్రాన్ని రాజమౌళి తీర్చిదిద్దబోతున్నట్లుగా తెలుస్తోంది. ఇప్పటికే మూవీలో తన క్యారెక్టర్ కోసం సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రత్యేకంగా సిద్ధమవుతున్నారు. తాజాగా వైరల్ అవుతున్న ఫోటోలలో మహేష్ బాబు లాంగ్ హెయిర్ తో కనిపించడం విశేషం. లుక్ పరంగా కూడా చాలా చేంజ్ చూపించబోతున్నట్లుగా ప్రచారం నడుస్తోంది. ఈ సినిమాలో హాలీవుడ్ యాక్టర్స్ కూడా కీలక పాత్రలలో కనిపించబోతున్నారని సమాచారం.  ఇది ఇలా ఉంటే సాధారణంగా మహేష్ ప్రతీ సినిమాకు ముందు లేదా చివరలో ఏదో వెకేషన్ కు వెళ్లడం కామన్. లేదంటే షూటింగ్ కు కాస్త గ్యాప్ వచ్చినా ఒక వారం రోజులు ఫ్యామిలీ తో కలిసి ట్రిప్ కు వెళుతుంటారు.

అయితే రాజమౌళితో సినిమా అంటే హీరోలకు ఎప్పుడు రెస్ట్ దొరుకుతుందో చెప్పడం కష్టం. ఒక్కసారి ఆయనతో సినిమా స్టార్ట్ చేస్తే మాత్రం ప్రమోషన్స్ వరకు హీరోలు మరో పని పెట్టుకోకూడదు. అలాంటిది మహేష్ ఇప్పుడు జక్కన్నతో సినిమా చేస్తున్నాడు కాబట్టి మహేష్ అలాంటివాన్ని పక్కన పెట్టాయాలి. ఆ విషయం మహేష్ కు కూడా ముందే తెలుసు. అందుకే షూటింగ్ కంటే ముందే ఫ్యామిలీ తో ఇప్పటికే ఒక మూడు ట్రిప్పులు వేసేశాడు. ఇక రీసెంట్ గా మరో ట్రిప్ వెళ్లాలని అనుకోగా సడన్ గా క్యాన్సిల్ చేసుకోవాల్సి వచ్చింది. సమ్మర్ హాలిడేస్ లో పిల్లలతో కలిసి ఏదో ఒక కంట్రీకి వెళ్లడం మహేష్ కు అలవాటు కానీ ఇప్పుడు జక్కన్న వర్క్ షాప్ స్టార్ట్ చేయాల్సి ఉందని చెప్పడంతో మహేష్ ప్లాన్స్ అన్ని కూడా క్యాన్సిల్ చేసుకున్నాడు. సాధారణంగా మహేష్ ఏ డైరెక్టర్ తో అయినా సరే ప్రాణం పెట్టి వర్క్ చేస్తాడు.

ఇక రాజమౌళి లాంటి దర్శకుడితో సినిమా చేసే ఛాన్స్ చాలా రేర్ గా దొరుకుతుంది కాబట్టి ఇంకెంతలా వర్క్ చేస్తాడో ఊహించవచ్చు. అందుకే తనకు అలవాటైనా ఫ్యామిలీ వెకేషన్స్ కూడా వదిలేస్తున్నాడు. మరి మహేష్ షూటింగ్ స్టార్ట్ అయ్యాక ఆ ప్రాజెక్టు కోసం ఎంతగా హార్డ్ వర్క్ చేస్తారో చూడాలి. ఇక SSMB 29 అఫీషియల్ అనౌన్స్మెంట్ కోసం సూపర్ స్టార్ మహేష్ బాబు ఫ్యాన్స్ చాలా కాలంగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ మూవీ ప్రీ ప్రొడక్షన్ పనులు జోరుగా సాగుతున్న కూడా చిత్ర యూనిట్ నుంచి ఎలాంటి అనౌన్స్మెంట్ ఇంకా రాలేదు. మరి జక్కన్న అఫీషియల్ క్లారిటీ ఎప్పుడు ఇస్తాడో చూడాలి.